# వింజామర

సుందరం అందమైన బొమ్మలు వేస్తాడని అనేవాళ్ళే అందరూ కాక పోయినా అందమైన బొమ్మలు వెయ్యడు అనేవాళ్ళు చాలా కొంచెమ్మందే వున్నారు. ఆ కొంచెమందిని సుందరం గుర్తించడు. బద్ధకస్తులంటాడు. కళకు బద్ధవిరోధులంటాడు.

అయితే కూడా సుందరం చిత్రకారుడని వాళ్ళ యింటిమీద బోర్డు చూసిన వాళ్లందరికీ తెలుస్తుంది. అందులో కొంచెం మందికైనా సుందరం గీసిన రేఖచిత్రాలు గట్రా పడ్డ పత్రికలను చూసే అవకాశం ఉండే ఉంటుంది. అయితే సుందరం చేసిన ఆయిల్ పెయింటింగ్ చిత్రాల గురించి అతనికి తెలిసినంతగా, అవి అతనికి విచ్చినంతగా మరెవరికీ నచ్చవు!

వాటికి కూడా మంచి ప్రఖ్యాతి ఉందని కనీసం వాళ్లావిడ యిరుగు పొరుగు వాళ్ళతో చెబుతున్నప్పుడు విన్నవాళ్లేనా అనుకోవాలి. సుందరం ఒకసారి చక్కని పూల గుత్తి మూడు రంగుల సమ్మేళనంగా కుంచెతో అలా అలా అచ్చం పూలే వాసన వేస్తున్నాయా? అన్నంత బాగా వేస్తే, వాళ్లింట్లో "నిమ్మీ" (కుక్క పిల్లపేరు - ప్రఖ్యాతిగన్న మరెవరి పేరుతోనేనా ఈ పేరు ఏకీభవించడం జరిగితే అందుకు కారణం పాత్రలు కేవలం కల్పితం కాకపోవడం మాత్రమేనని సుందరం ఉద్దేశం) కూడా తోకాడిస్తూ వాసన చూసిందని సుందరంగారి శ్రీమతి కథనం. ప్రఖ్యాత వ్యాఖ్యాతలు ఒకసారి సుందరం గురించి, "ఇంత ఓపికగల చిత్రకారుడు మరొకరు లేరంటే అది అతిశయోక్తి కాదు" అన్నారుట. ఎందుకంటే 'సుందరం చిత్రకళా ప్రదర్శనం అని ఒకదానిని సుందరమే-సుందరంగా ఏర్పరచుకొని తానే మొదట ప్రదర్శన మందిరం అంతా కలియజూసి, ఎక్కడ, ఏ బొమ్మలు ఏ ఏంగిల్‌లో వుంచితే బాగుంటుందో చూసుకొని మరీ, ప్రతికలవాళ్లని పిలిచాడు. పత్రికలవాళ్లంత మంచివాళ్లు వాళ్లేనని - వాళ్ళనుకుంటారు. సుందరం కూడా ఆ మాటనడంతో, వాళ్లు సుందరం చిత్రకళ బహు అపురూపమని ఒప్పేసుకున్నారు. అదీకాక సుందరం "పికాసో' గురించి తాను ఎప్పటికేనా ఒక పుస్తకం రాస్తానన్నాడు. ఇంతవరకు పికాసో గురించేకాదు. ఆఖరికి తెలుగుదేశంలో అత్యంత ప్రముఖ చిత్రకారులైన 'రోమా' , 'దోమా', 'గామాల' గురించి కూడా యింత పిసరు చదవడం, చూడటం చెయ్యలేదు గనుక అతనేం

వేసినా అందులో ఒరిజినాలిటీ ముక్కు గుద్దినట్లుంటుంది.

ప్రముఖ పత్రికల వాళ్లు సుందరం చిత్రకళా ప్రదర్శన కొచ్చినప్పుడు సాయంకాలం మూడున్నర-నాలుగు గంటల మధ్య కాలం అయివుంటుంది. అది కాఫీ తాగాలనీ లేదా కాఫీ తాగటం మానేసి అందుకు ముందుగా కాస్త తేలికైన ఫలహారం (పళ్లుకాదు-హాట్ హాట్ ఏదైనా అని తాత్పర్యం) తిని-ఆనక కాఫీ తాగాలి అని అనుకుంటూ వచ్చారు. సుందరం చాలా తెలివైన చిత్రకారుడు. 'కళ' కొందరికి ఉగ్గుపాలతో పెట్టినట్లు అబ్బుతుందంటారుకదా! సుందరానికి ఆ రెండూ పెట్టకముందే 'చిత్రకళ' వచ్చిందనీ, అందుకు దాఖలాగా ఒక చిన్న ఉదాహరణ కూడా ఉందనీ, సుందరం మేనమామ (ఆయన యిన్సూరెన్స్ ఏజంట్) సుందరాన్ని ప్రతికలవాళ్లకి పరిచయం చేస్తూ చెప్పాడు. వాళ్ల మేనమామ రామాయణం చెబుతూవున్నా జీవిత భీమాగురించి వాల్మీకి వ్రాసాడని ఘంటాపథంగా చెప్పగల 'మీసాలి', (మీసాలు గలవాడని బహు వ్రీహి సమానం) అయితే వాళ్ల భీమా మామ, పత్రికల వాళ్ళకి, సుందరం చిత్రకారుడు ఎలా పుట్టుకతోనే అయాడో చెబుతూ వుంటే - ''మా సుందరం బొడ్డున వెండి చెంచాకి బదులు 'కుంచె'తో పుట్టాడు అనవచ్చు''. అని ముగిస్తూ వుండగా, వాళ్లు ఆవలించారు. అలా వాళ్లు ఆవలిస్తారని తెలిసిన సుందరం వాళ్లకి 'కాఫీ పోస్తా'నని చెప్పాడు....

అప్పటికప్పుడే కాస్త మిక్స్చర్, ఒక స్వీటు గల పొట్లాలు కూడా పంచడం ప్రారంభించాడు. వాళ్లు మంచివాళ్లు. ఆ వూళ్లోకల్లా పెద్ద హోటలువాళ్లు ఈ 'అల్పాహార' (అల్పమైన కాదు) విందు చేస్తున్నారని ఆ సంచీమీద ముద్ర చూసి, 'ముక్క' కంపుకొడతాయనే భయంచేత, ముక్కుదగ్గిర పెట్టుకోకుండా - నోటి దగ్గర నేరుగా పెట్టుకొని తింటూ, భీమాధిపతి - సుందరం మేనమామ ఉపన్యాస శేషభాగాన్ని భరించడానికే నిర్ణయించుకున్నారు.

కాఫీ కావాలంటే, అది వినండి అన్నట్లు సుందరం వాళ్ళకేసి చూస్తున్నాడు కనుక వాళ్లు చిత్రకారుని మేనమామ ఉపన్యాసాన్ని వింటున్నట్లు నటించాలని నిర్ణయించుకున్నారు.కొందరు అతని చెవుల్లో వెంట్రుకలు వున్నాయా? అన్నట్లు చూశారు. (మరి అతను సుందరం మేనమామ కదా) ఉన్నాయ్! అంచాత సుందరం అదృష్టవంతుడే ననుకున్నారు. అసలు ఉగ్గు, పాలు పట్టకుండానే , సుందరం ఒక అద్భుత చిత్రకారుడై, తైలవర్ణ, త్రివర్ణ రేఖా చిత్రాలను పుంఖానుపుంఖాలుగా వేసి-రవీంద్రభారతి హాలంత హాలును అన్ని గోడలా (మీదా, క్రిందాకాదు) నింపగల సమర్థవంతుడై రాస్తాడు అనుకుందుకి కారణం ఏమిటయ్యా అంటే, సుందర చిత్రకారుని మేనమామగారైన యిన్ స్యూరెన్స్ ఏజంట్ మాటల్లోనే వినండి-

''నేనూ, ఇదివరకు ఓ చిత్రకారుణ్ణే. నా బొమ్మలు లండన్‌లో పెడతారని తెలిసినా సరే-వీల్లేదు అన్నాను. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఎప్పటికైనా వాటిని ఢిల్లీలోనే పెడదామనుకున్నాను. కాని, అంతలో ఒకసారి భూకంపం వచ్చింది. నాకు సరిగ్గా జ్ఞాపకం లేదు. ఆ రోజే నా చిత్రకళంతా అగ్నిప్రమాదానికి ఆహుతైపోయింది. కాని, అదే రోజు నాకు మేనల్లుడు ఈ సుందరం పుట్టాడు.

వాణ్ణి చూశాను. వాణ్ణి నేనే కాదు, వాళ్లమ్మ, నాన్నమ్మ, మంత్రసాని కూడా చూశారు. తమాషా ఏమిటీ అంటే వాడికి ముక్కూ, మూతీ నాలాంటివే వున్నాయి. ఇంతమంది, 'ఐ విట్నెస్' చేశాకా, నా కింక అనుమానం పోయింది. ధైర్యం వచ్చింది. నా బాధ తీరిపోయింది. ఇక మేనల్లుడు పుట్టాడు. వాడు పెరుగుతాడు - పెద్దవాడవుతాడు - చిత్రకారుడు తప్పక అవుతాడు.. నేనింక బొమ్మలు సృష్టించనక్కరలేదు. సరి-నేటితో నా చిత్రకళా తపస్సు ఫలిచింది - హా! నేడే కదా నాకు విడుదల అనుకున్నాను. అంతేమరి! కుంచె ముట్టుకోలేదు. బ్రష్ పట్టుకోలేదు. బుష్‌కోట్లు, పంట్లాలు వేస్తూ, యిన్స్యూరెన్స్ చేస్తూ - ఆశతో సుందరం సుందరమైన చిత్రాలు వేస్తూ, చిత్రకళా కారుడవుతాడన్న ఆశతో ఇలా బట్టతల వస్తూ వున్నా బెంగపడకుండా వున్నాను. నేటికి నా కల ఫలించింది."

సుందరం మేనమామను చూసిన పత్రికలవాళ్లు బట్టతల పోలికకోసం సుందరం మొహంలోకి చూశారు. కాని, యింకా అది హార్బర్‌లా కాస్త మేరకే వుంది. 'ఏయిర్‌డ్రోమ్'లా పూర్తిగా వ్యాపించి వుండలేదు. "ఇంకా వృద్ధిలోకి రాగల అవకాశాలున్న వాడు సుందరం.. వాళ్ల మేనమామ బుర్ర గుద్ది పుట్టిన చిత్రకళాకారునికి ఉజ్జ్వల భవిష్యత్తు గలదు," అని రాద్దామని కూడా వాళ్లల్లో ఒకరిద్దరు యువకులు అప్పటికప్పుడే షార్ట్‌హాండ్ రాసుకున్నారు కూడా!

సుందరం బొమ్మలన్నీ - కాఫీ తాగిన నేరానికి శిక్షగా - ఒక్కొక్కటే చూస్తున్నారు, పత్రికలవాళ్ళకి ఆ పని ఏమంత కష్టంగా తోచలేదు గాని, సుందరం మేనమామ భీమామామగారు, ఒక్కో బొమ్మ గురించీ గంభీరోపన్యాసం దంచేస్తువుంటే మాత్రం కొంచెం లోపల ఏడ్చిపోయారు.

ఒక బొమ్మ వుంది. అది 'లినోకట్' చిత్రమన్నారు భీమేశ్వరంగారు. 'గుఱ్ఱం తోక' అని నోట్‌చేసుకున్నాడొక యువపాత్రికేయుడు. అంతేనా "నేను మద్రాసులో వున్నప్పుడు ఒకానొక సుప్రసిద్ధ హేమా చిత్రకారుడు బొమ్మని లైఫ్‌సైజులో అనగా నిజం గుఱ్ఱం తోకంత తోకలాగే వేసేడని కూడా ప్రక్కనున్న మరో ఉర్దూ పాత్రికేయునితో ఆంగ్లంలో చెప్పాడు. కాని, అంతలో సుందరం అడ్డుకొని, "సార్! ఐయామ్ సారీ! నేను భావ చౌర్యానికే కాదు, తోక చౌర్యానికికూడా పూనుకునే కళారాధకుణ్ణికాదు. అది అసలు మీరు అనుకున్న గుర్రంతోక-కాదు అంటే అది మరే గుర్రం తోకేనా అవవచ్చునని, మీ రనుకోగల్రు, గనుక చెబుతున్నాను. వినండి. అది అసలు గుర్రంతోక కానేకాదు. దాన్ని చిత్రించడానికి గుర్రం తోక కాదుకదా, ఆఖరికి గుర్రంపేరు కూడా యిన్స్పిరేషన్ యివ్వలేదు." అన్నాడు. ఆ యువరచయితకి ఓటమి యిష్టంలేకపోయింది. "మోడరన్ ఆర్టులో యిన్స్పిరేషన్ ఒక వస్తువు నుంచి వస్తే మరో రకం కళాఖండం చేస్తారు కదండీ," అన్నాడు.

"అనుకోండి. నాకుతెల్సు. ఈ బొమ్మ వేయడానికి ఇన్స్పిరేషన్ ఒక అమ్మాయి నుంచి వచ్చింది,' అన్నాడు సుందరం.

"పోనీ టెయిల్?" అన్నాడు సుప్రసిద్ధ విమర్శకాగ్రేసరుడు. (హెయిర్‌స్టయిల్ స్పెషలిస్టులతో ఆయన యింటర్ వ్యూ చేశాడొకసారి)

"నో! సారీ! హార్స్ టెయిల్ అమ్మాయి కాదు - అసలా మాటకొస్తే ఆ స్త్రీ మూర్తి, అమ్మాయి కానే కాదు."

సుందరం మాటలకి - అతణ్ణి అంత వాడిగా చేసిన 'భీమా' గారుకూడా నోరు తెరిచారు.

"దెన్ వాట్?"

విలేఖరులు ఆ చిత్రంకేసి చూస్తూ మురిసిపోయారు.

"అదొక గృహిణి ధరించిన కొండ చీపురుకట్ట... సింబాలిక్‌గా ఉండాలని, గృహిణిని ఎలిమినేట్ చేసి, కేవలం ఆమె భారతీయ సంస్కృతీ చిహ్నంగా ధరించిన చీపురుకట్టను మాత్రం వేశాను..." సుందరం ఒప్పుకున్నాడు.

"ఒహో" అన్నారు పత్రికలవాళ్ళు, ఒక్కడు తప్ప. "ఆ చీపురు ధారిణికూడా వుంటే బాగుణ్ణు" అన్నాడతగాడు.

"బాగుణ్ణు. కాని అది 'థాట్‌ప్రావో కింగ్ ఆర్ట్' అవుతుందా?" అన్నాడు భీమాగారు. ఆర్ట్ ఆలోచనల్ని రేకెత్తించేదిగా వుండాలి అని కూడా చెప్పాడు.

"అదికాదండీ! ఆ చీపురు పట్టుకున్న 'సోర్స్ అఫ్ ఇన్‌స్పిరేషన్, మా ఆవిడే నండీ-" అని వొప్పేసుకున్నాడు సుందరం, అసలు కారణం బహిరంగపరుస్తూ కొంచెం సిగ్గుగా - "ఆవిడంత యిదిగా' వుండదు లెండి" అన్నాడు.

ఆ విధంగా ఆ చిత్రకళలో చాలా గొప్ప మోడర్న్ ఆర్ట్ ఉందని గ్రహించారు విలేఖర్లు.

విలేఖర్లు "మంత్రిగార్ల" స్టేట్‌మెంట్ల కన్న సుందరం 'పటాలు' బాగున్నాయన్నారు. మంత్రిగారి స్టేట్‌మెంట్ల నిజాయితీకి, సుందరం చిత్రకళలోని వాస్తవికతకీ గల సంబంధం ఏమిటో తెలీక తికమపడ్డాడు. సు.మే.మా భీమారావు గారు.

[illegible] సుందరం మర్నా[illegible] పేపర్లో మూలగానే అయినా, మూల్కకాల్మ్ నెత్తిమీద యిరవై పాయింటులో పడ్డాడు. సుందరం కళాకారుడు అని మొదటే రాశారు వాళ్లు. సుందరమైన కళాప్రదర్శనానికి - వచ్చేసారి మంత్రి అవుదామనుకుంటున్న ప్రఖ్యాత ఆయిల్‌మర్చంటూ, దేవభక్తుడూ అయిన భీషణమూర్తిగారు ప్రారంభోత్సవం చేస్తామన్నారు. భీమారావుగారు యిందుకు యిష్టపడలేదు. సుందరం దూరం ఆలోచించాడు. మంత్రి అవుతాను అనుకున్నమర్చెంట్ - సెంచరీ కొడదాము అనుకున్న క్రికెట్ కిలాడీ విజయ్‌మర్చంట్‌లాంటి వాడు. అంటే అవకపోడు. అరడజను కార్లు - నాల్గు ఖద్దరు సూట్లు వున్నవాడు ఏమేనా అవగల్డు అనుకున్నాడు, అందుకే ఒప్పుకున్నాడు.

భీషణమూర్తి రిబ్బను కత్తిరిస్తున్నప్పుడు పత్రికలవాళ్లు ఫొటోగ్రాఫర్లను తేలేదు. అదే భీషణమూర్తికి దుఃఖం కలిగించింది. భీషణమూర్తి ప్రదర్శన అంతా చూశాడు. చిత్రకళ దేశానికి 'జీవగర్ర' అన్నాడు. 'వెన్నెముక' అన్నాడు. భారతమాత పవిత్రమైనది అన్నాడు. చిత్రకళ అడుగంటిపోతే దేశానికి పతనం

తప్పదన్నాడు. (ఉద్ఘాటించాడు అనాలిట.)

ముఖ్యంగా 'లినోకట్ చీపురుకట్' చిత్రం చూస్తూ భీషణమూర్తి విపరీతమైన కళాభివేశంతో 'వోహో' మన్నాడు "ఇది వింజామరకదూ?" అన్నాడు. భీమారావుగారు "ఔను" అన్నాడు వెంటనే. సుందరం గొతులో పడ్డ వెలక్కాయలను అలాగే మింగాలని ప్రయత్నంచేశాడు. 'వింజామర' చిత్రం బాగుందన్నాడు కాబోయే మంత్రిగారుమొమ్మారు, కాని, మర్నాడు పత్రికలలో ఈ వార్త ఎక్కడా పడలేదు. ఆయన చాలా నిరాశపడ్డాడు. మరణవార్తలు, కోర్టు వార్తలు, స్థానిక వార్తలు, నిన్నటి వార్తలు, అన్నీ వేశారు. 'భీషణ' వార్త లేదు. సుందరంలాంటి చిన్నచిత్రకారుడి ప్రదర్శనను ఓపెన్‌చేస్తే ఏమవుతుంది మరి? అని లోలోపల అనుకున్నాడు. అదేమరో పెద్ద చిత్రకారుడుం లేడు అన్నదీ ఆయన మాటలే) అయితే తన పేరును పత్రికలవాళ్లు యిలా యిగ్నోర్ చెయ్యరను కున్నాడు. రేపు మంత్రి అయిన తర్వాత సుందరం చిత్రకళ 'అమెచ్యూర్'గా వుందనీ, వీలైతే ఎక్కడో అక్కడ ఒక స్టేట్‌మెంట్ పారేద్దామనుకున్నాడు. "నాన్‌సెన్స్"! వింజామర అని నేను మెచ్చుకున్న చిత్రం అసలు చీపురుకట్టలా వుంది. కాని, దాన్ని నా స్థాయికి తగ్గట్టుగా పేపర్లో వేయించాలని, 'వింజామర' అన్నాను. ప్చ్.. కాని ఏంచేస్తాం.. పత్రికలవాళ్లు ఉత్త దగుల్బాజీలు - అని వూరటపడ్డాడు.

వారంరోజుల్లో ప్రదర్శన ముగిసింది. కాబోయే మంత్రిగారి పేరు పత్రికలలో పడలేదు అనే బెంగ ఆయనకు తీరిపోయింది. "కాలమే కదా మందు"-

*　　　*　　　*

కాని ఓ రోజు ప్రొద్దున్నే సుందరం ప్రత్యక్షమయ్యాడు వాళ్లయింటిముందు, "నమస్కారం! అబ్బ మంత్రి కళ వుట్టిపడుతోంది మీలో." అన్నాడు సుందరం మొదటే. మంత్రిగారు.. సారీ కాబోయే గారు లుంగీ, బనీనులోనో వున్నారు.

"ఏం కళో - అంతా డబ్బు దండగ వ్యవహారంగా వుంటోంది." అన్నాడు తన పూలదండల ఖర్చు తనే యిచ్చుకున్న కాబోయే మంత్రిగారు కసిగా, (పైకి నవ్వుతూ).

"ఇవాళ దండగే, రేపు పండగ నిస్తుంది సార్! అలా కొట్టి పారెయ్యకండి కళాకారుడి మాటలు' 'నవ్వాడు సుందరం. ఆ నవ్వుకూడా వాళ్ల మేనమామ భీమారావుగారి నవ్వు పోలికలున్న కళాత్మకమైన నవ్వు.

కళాత్మకమైన నవ్వుకు కూడా యింకా చలించలేకపోవడానికి భీషణమూర్తి యింకా మంత్రి కాలేదుగా! "కూర్చోండి! మళ్లీ ఏదేనా ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారా? నాకు ఈ మధ్య బిజీగా వుంటోంది." అన్నాడు నసుగుతూ,నటిస్తూ, బుర్రగోక్కుంటూ-

సుందరం మొహం తను యిలా నిరాకరిస్తున్నందుకు 'దమ్మిడీ' అంతా లేక యింకా పైసా అంత చిన్నదవుతుందనుకున్నాడు కాని, అది పాతారూపాయి కాసంతైంది. వికసించింది!

"అబ్బే! మీరు మినిష్టరు అయితే గాని ఇంకో ఎగ్జిబిషన్ ఏర్పాటు చెయ్యను. అప్పుడు మీ గౌరవార్థం ఒకటి పెడతాను. ఝుమ్మని యింగ్లీషు, ఫారిన్ పేపర్ల వాళ్లని కూడా పిలిచి పెట్ పార్టీ యిస్తాను..." అన్నాడు సుందరం.

భీషణమూర్తికి యిదంతా ఏదో వ్యూహంలా వుందే అనిపించింది కాని, "కాఫీ తాగుతారా?" అన్నాడు బైటికి.

"అబ్బే! తాగే వచ్చానండి! థాంక్స్" - చంకలో నుంచి మూడడుగుల పొడుగు మూడంగుళాల దళసరి, అంగుళంన్నర వెడల్పు గల ప్యాకెట్‌ని తీసి, విప్పుతూ అన్నాడు సుందరం.

బాకునో, చాకునో,తుపాకీనో తీస్తున్నట్లుగా వుంది భీషణమూర్తి కాదృశ్యం.

కాని, "వోహో" అన్నాడు ధైర్యంగా.

"థాంక్స్" మెచ్చుకున్నాడు కదా అని చెప్పాడు సుందరం.

అది వింజామరా? కాదు కాదు, చీపురు కట్ట! నో... నో... హార్స్ టెయిల్- ఉహూం

"యిది మీరు తీసుకోవాలి... అంటే కొవాలి..."

కుర్చీలో నల్లులు కుడుతున్నట్లు కదులుతున్నాడు భీషణమూర్తి. సుందరం ఆ బొమ్మని అక్కడ పెట్టి.. ఈ బొమ్మకి నిజంగా మీ మెప్పు ఎప్పుడైతే పడ్డదో అప్పుడే ప్రజలకి విపరీతంగా నచ్చిందనుకోండి. మీ టేస్ట్ అమోఘం" అన్నాడు సుందరం.

"టేస్ట్ మాటకేం గాని, చీపురుకట్ట బొమ్మ కన్నా...."

కాబోయే మంత్రిగారు గొంతుకలోని పచ్చి వెలక్కాయను మ్రింగుతున్నారు.. "గాంధీగారిదో, నెహ్రూగారిదో..." అనబోతున్నాడు.

"అమ్మమ్మ! యిది చీపురుకట్టకాదు. ఆ మాట మీరు ఖండించాక... నేను అవునని ఎలా అంటాను? యిది మీరన్నట్లు రాధ కృష్ణుడికి పట్టిన వింజామర." అన్నాడు సుందరం పట్టుదలగా (లోపల స్వగతంగా వాళ్ళ ఆవిడ తనకు పట్టిన చీపురుకట్ట అని కూడా అనుకున్నాడేమో సుందరం)

కాబోయే మంత్రిగారు రేపు తను మంత్రి అయ్యాక, స్టేట్‌మెంట్లని ఖండించాలిగా, దాన్ని తల్చుకుంటున్నాడు భీషణమూర్తి! సుందరంవదల్లేదు. పట్టుదల గల కళాకారుడు అంత సులువుగా వదుల్తాడా?

"అసలు యిది మీలాంటి మినిస్టర్లు ఐమీన్ మినిస్టర్లు కావల్సినవాళ్ళ యిళ్ళల్లోనే వుండాలి అని మా పురంధరం పేటవాళ్ళు అనుకుంటున్నారు" అన్నాడు సుందరం... ప్రజలమాట జవదాటరాదని హెచ్చరిస్తున్నట్టు.

"సరే! అది విసెంజామర అనే అనుకుందాం... దాని క్రింద పెద్ద అక్షరాల్లో అలా అని రాయండి... యింతకీ వెల?"- "ఇన్సల్ట్ చేస్తున్నారు! మీరు కూడా వెల అడుగుతారా? మా చిత్రకళ అమూల్యమని మీరేగా అన్నారు - ఉంచండి"-

('అన్నాడా? ఏమో తనకు జ్ఞాపకం లేదు' అనుకున్నాడు కాబోయే మంత్రిగారు 'భీ'మూర్తి)

అలా అంటూ సుందరం లేచాడు యిక యీ బొమ్మనుయిక్కడే వదిలేస్తున్నాను. పటం కొట్టుకో మన్నట్లు.

"దీనికైనా మెటీరియల్స్ ఖర్చులు మాత్రం బిల్ చేస్తా.. బిలు వెంబడి పంపండి." అని మెట్లు దిగిపోయాడు సుందరం పీడ వదిలించుకున్నట్లు.

"ఉప్! నా బొంద", అనుకున్నాడు" భీ.గారు. బయటికి మాత్రం - "మీ పురంధరం పేట ప్రజలకి నా శుభాకాంక్షలు అందించాలి సుమా!" అని కేకవేశాడు. (ఎందుకేనా పనికొస్తాయని)

"తప్పక... తప్పక! మీరీ బొమ్మని ఖరీదు చేశారని కూడా చెప్తా" సైకిలు మీద పారిపోయాడు సుందరం.

"సరే! చీపురుకట్టే అవనీ, ఏంచేస్తాం వింజామరే అనుకుందాం! ఈ ఖరీదు రేపు ఎన్నికల్లో పోస్టర్లు రాయించి, వీడి దగ్గరే రాబట్టుకుందాం' అనుకున్నాడు - గుర్రంతోకను సాలోచనగా చూస్తూ భీషణమూర్తి.

"ఏమండీ! ఆ బొమ్మ పారేసివచ్చారా?" సుందరాన్నియిల్లాలు నిలదీసింది ఇంట్లో అడుగుపెట్టగానే.

"పారేశానే" సుందరం నవ్వుతున్నాడు విజయగర్వంగా, సైకిలు గంటకొట్టి మరీ..

"నవ్వుకూడా ఎందుకు? చింకి చేటలాగా?" - అది నా చేతిలోని చీపురుకట్టనీ, నేను బాగు లేను గనక దాన్ని ఒక్క దాన్నే వేశారనీ, పదిమందికీ సిగ్గుమాలి ప్రకటనలు చేశారటా ? - పైగా పేపర్లలో కూడా' '-

ఆవిడ మాటలకి అడ్డుపడి...

"ఆఁ! పేపర్లే వేశాయా? ఆమాట!" సుందరం ఎగిరి గంతేయబోతున్నాడు... "ఎక్కడే? ఏవీ?' ' వెతుకుతున్నాడు...

"ఛీ ! సిగ్గు లేదూ? వేస్తాయి... వేస్తాయి... ఏదో పేపర్లో పడక పోతుందా?" అన్నాదామె కోపంగా.

నీళ్లుకారిపోయాడు సుందరం. భార్యకోపం కూడా తగ్గించుకుంది.

"నే నీ కథ అంతా ఫలానా మనరచయిత గారు లేరూ, వాళ్లావిడతో చెప్పాశాను... ఏదో విధంగా పేపర్లో పడుతుంది లెండి.. బెంగ పడకండి. నేనెంత అనాకారినైనా, భర్త మేలుకోరే యిల్లాల్ని..."

"చచ్చాం!" అన్నాడు సుందరం.

"మరేం చావకండి! నేను మరీ పెద్దకుంకుమ బొట్టు పెట్టుకుంటున్నా నీ మధ్య . అంతా బాగుంటోంది అంటున్నారు కూడా... లేవండి భోజనానికి..." వాళ్లావిడ (యిల్లుతుడుద్దామని) మూలనున్న కుంచెచీపురు అందుకుంటూ అంది.

"ఇంతకీ వాళ్లావిడ, అతనికి చెప్తుందంటావా? ఆ బొమ్మ నీ చీపురుకట్టగాదు, భీషణమూర్తిగారి 'వింజామర' అని చెప్పరాదుటే" అన్నాడు కాస్త భయంగా సుందరం, పేపరులో పడాలనే ఆశకూడా వ్యక్తపరుస్తూ.

"యిష్! మరిచిపోండి! ఏదో వొక గుర్రంతోక! ఏదైతేనేం? మీ కళ రూటికీ సాటికీ రాలేదు కదా!' ' అని జాలిపడ్డదామె.

"ఓసి పిచ్చి చీపురుకట్టా! నీ మొగుడు అంత చేతకాని కళాకారుడుకాదు. హోలు అద్దె. ప్రెస్‌వాళ్ల పార్టీ,లైటింగ్ ఖర్చు అన్నీ కలిపి మరీ...యివాళ వుదయం సంపాదించేశా"నన్నాడు. సుందరం భార్య వేపు విజయగర్వంతో చూస్తూ.

"అదెట్లాగండీ?"

"నువ్వా చీపురుకట్ట వూపుతూ మాట్లాడకు. నానెత్తిన చెత్త చిందుతోంది... ఎలాగా? అని ఓ కళాకారుణ్ణి నువ్వు అడుగుతున్నావా? నీ చీపురుకట్టను వింజామరగా మార్చేసి, ఓ కాబోయే మంత్రిగారికి వెయ్యినూటపదకొండు రూపాయలకు అంటగట్టేశా" నన్నాడు. తన కళకి తనే మురిసిపోయి సుందరం. భార్య మొహం వింజామరంత అయిందిః

"మీ మొహం! నా చీపురు కట్ట విలువ ఆ కాబోయే మంత్రిగారికె లాగ తెల్సు? అందుకే దాన్ని ఆయన వింజామరగా మార్చుకున్నాడు" అంది భర్తతో పాటు వంటింట్లోకి నడుస్తూ

**(1982 యువదీపావలి సంచిక)**